సాక్షి

ఏలూరు

శుక్రవారం ; 5 ; సెప్టెంబర్ ; 2025



గురువులపై కర్ర పెత్తనం

కూటమి ప్రభుత్వంలో సర్కారీ పాఠశాలల ఉపాధ్యాయులపై రోజురోజుకూ నిఘా పెరుగుతోంది.

8లో ▸



మద్యం మత్తులో దాడి

మద్యం మత్తులో ఉన్న యువకుడు కత్తితో భార్యాభర్తలను తీవ్రంగా గాయపర్చిన ఘటన తణుకులో చోటుచేసుకుంది.

8లో ▸



వదలని వరద గోదావరి

గోదావరి వరద, జోరు వానలు ముంపు మండలాల వాసులను మూడు నెలలుగా కలవరపెడుతున్నాయి.

8లో ▸

న్యూస్‌రీల్

యూరియాపై వాస్తవాల వక్రీకరణ



దేగా ప్రభాకర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూరియాపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రకటన అవాస్తవమని, వాస్తవాలను వక్రీకరిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ గురువారం ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులకు పుష్కలంగా యూరియా సరఫరా చేస్తున్నామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటన అవాస్తవం అన్నారు. వాస్తవాలు పరిశీలించకుండా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవసరాలకు మించి యూరియా ఉందని అధికారులు చెబుతున్నారని, వాస్తవానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. బస్తా యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలో నిలవాల్సిన దారుణ పరిస్థితిని ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. యూరియా సమస్య ఎందుకు వచ్చింది అని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు యూరియాను దారి మళ్లించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. మరోవైపు ప్రైవేటు వ్యాపారులు యూరియాను బ్లాక్ మార్కెట్లకు తరలించి బస్తాకు రూ.100, డీఏపీ రూ.200లు అధికంగా విక్రయిస్తున్నారని విమర్శించారు. ఈనెల 8న రైతుల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

25 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాస్థాయి గురుపూజా దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఏలూరు జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. 25 మంది ఉపాధ్యాయులను జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేశామన్నారు. **స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో..** బత్తుల అనురాధ, వెల్లటూరి వెంకట సీతారామ ప్రసాద్, పంతంగి వీరకోటి, పంతగాని సోమయ్య, పోలిమెట్ల అనిమేరీ సమాధాన ప్రేమావతి, పీవీఎస్ సత్యనారాయణ, వి.శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, ఎంఎల్కే శ్రీనివాస్, షేక్ రంగా వలి, ఆర్.వెంకట నాంచారయ్య, టి.వెంకట అప్పారావు, ఎ.అప్పారావు ఉన్నారు. **సెకండరీ గ్రేడ్ టీచర్ కేటగిరీలో..** ఎస్.మహాదేవి స్వర్ణ, సీహెచ్ కుసుమకుమారి, ఎం.శ్రీనివాసరావు, డీకేఎస్ఎస్ ప్రకాశరావు, పి.రాజ్యలక్ష్మి, డి.గంగమ్మ, ఎస్.నాగేశ్వరరావు, ఐఎం నిర్మల కుమారి, ఎ.వెంకటేశ్వర రావు, ఓ.నంద కుమార్ ఉన్నారు. వీరిని అతిథుల చేతులమీదుగా సత్కరిస్తామని చెప్పారు.

ఎండీయూ వాహనాల రిజిస్ట్రేషన్ మార్చుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజా పంపిణీ వ్యవస్థలో పౌర సరఫరాల శాఖ వినియోగించిన ఎండీయూ వాహనాలను పౌరసరఫరాల శాఖ నుంచి తొలగించిన నేపథ్యంలో వాటి క్లాస్ ఆఫ్ వెహికల్‌ను రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో మార్పించుకోవాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 24 ఎండీయూ వాహనాలు ఉన్నాయన్నారు.

రోడ్లను పునర్నిర్మించాలి

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిన ఏలూరు నగరంలో రోడ్లు చెరువులను తలపిస్తూ గుంతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. బుధవారం ప్రమాదకరంగా మారిన రోడ్లను పునర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఏలూరు నగర కమిటీ ఆందోళనకు దిగింది. రైల్వేస్టేషన్ వద్ద నుండి ఆశ్రమం కాలేజీకి వెళ్లే రోడ్డులో ధర్నా నిర్వహించింది. వంగాయగూడెం–పెదపాడు మార్గంలో అధ్వానంగా ఉన్న రోడ్డుపై రాస్తారోకో చేశారు.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేషనల్ మీనల్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఈనెల 7న జరుగనుందని, దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పూర్తిచేయాలని డీఈఓ కె.వెంకటలక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. కుటుంబ సంవత్సరాదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు.

ఎరువుల అక్రమ నిల్వలపై చర్యలు

ఏలూరు(మెట్రో): యూరియాను అక్రమంగా నిల్వ చేసినా, దారి మళ్లించినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. జిల్లాలో ఎరువుల లభ్యత, సరఫరాలపై వ్యవసాయాధికారులతో గురువారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు.

చెరువు పనులకు ప్రతిపాదనలు

ఏపీ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,513 మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు, పునర్నిర్మాణాలపై ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

ఆదర్శం.. బోధన వినూత్నం

అజ్ఞానాన్ని పారదోలి జీవితంలో విజ్ఞాన కాంతులు నింపేవారే గురువులు. పేరుకు మూడక్షరాలే అయినా తరాల తలరాతను మార్చే సత్తా వారి సొంతం. అందుకే మాతృదేవోభవ.. పితృదేవోభవ.. అన్న తర్వాత ఆచార్యదేవోభవ అంటూ తల్లిదండ్రుల తర్వాత గురువుకే ఆ స్థానం కల్పించారు. వినూత్నంగా విద్యాబోధన, సామాజిక సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు ఎంతోమంది ఉన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూ వారి ఉన్నతికి బంగారు బాటలు వేస్తూ శభాష్ 'గురూ' అనిపించుకుంటున్నారు.

– ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/గణపవరం/నిడమర్రు





చెత్తకుప్పల వద్ద ఉన్న చిన్నారులతల్లిదండ్రులతో మాట్లాడుతున్న స్టీవెన్



ఏఐతో పాఠాలు బోధిస్తున్న గాదిరాజు నరసింహరాజు

● బడిబాట పట్టించేలా.. స్టీవెన్ అడుగులు



బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం ఉద్యమంగా పెట్టుకున్నారు వైఎస్సార్ నగర్ పాఠశాల ఉపాధ్యాయుడు బీజేపీ స్టీవెన్. పేదలు, మురికివాడల్లోని పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు కృషిచేస్తున్నారు. తరచుగా ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ఎక్కడైనా బడికి వెళ్లని పిల్లలు కనిపిస్తే వారిని చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు. 1998లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన ఆయన పేద పిల్లలకు విద్యా సౌకర్యాలు కల్పించేందుకు సొంతంగా ఖర్చు పెట్టడంతో పాటు దాతల సహకారం కూడా తీసుకుంటున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, యూనిఫారం వంటి విద్యా సామగ్రితో పాటు పోషకాహారం కూడా అందిస్తున్నారు. ఏలూరు మండలం పోణంగి పాఠశాలలో తొమ్మిదేళ్లకు పైగా పనిచేసి విద్యార్థుల సంఖ్యను 120 నుంచి 270కు పెంచారు. బడి మానివేసిన పిల్లలను తిరిగి బడికి పంపేలా తల్లిదండ్రులకు అవగాహన కలిగించడం, విద్యార్థులను ప్రోత్సహించడానికి వారికి వచ్చిన మార్కులు, ప్రవర్తన ఆధారంగా అవార్డులు ఇస్తున్నారు.

● ఏఐతో పాఠాలు.. గాదిరాజు బాటలు

తరగతి గదుల్లో హైటెక్ బోధనా పద్ధతులతో ఆకట్టుకుంటున్నారు గణపవరం మండలం జల్లికొమ్మర జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు గాదిరాజు వెంకట నరసింహరాజు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌తో డిజిటల్ బోధనను చేరువ చేయగా పలువురు ఉపాధ్యాయులు వాటిని ఉపయోగిస్తూ **పాఠాలు బోధిస్తున్నారు. వీరిలో నరసింహరాజు మాస్టారు ఒకరు. 56 ఏళ్ల వయసులోనూ ఏఐ టెక్నాలజీ ద్వారా** పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఏఐ సాయంతో వీడియోలు తయారు చేసి బోధిస్తున్నారు. పలు అంశాలను విజువలైజ్ చేసి విద్యార్థులకు చూపిస్తూ వాటిపై అవగాహన, ఆసక్తి కల్పిస్తున్నారు. ఈ మాస్టారు తయారు చేస్తున్న వీడియోలను టీచర్ వాట్సాప్ గ్రూప్స్‌లో పోస్ట్ చేయడం వల్ల మిగిలిన ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఉంటోంది.

● వెలుగులు నింపుతున్న సుబ్బరాజు



పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు నిడమర్రు మండలంలో పనిచేస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు కె.సుబ్బరాజు. జీతంలో కొంత మొత్తాన్ని వెచ్చించడంతో పాటు తన ఇంటి వద్దనే ప్రత్యేక బోధనతో విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. 16 ఏళ్ల సర్వీసులో పదుల సంఖ్యలో విద్యార్థులను ఉన్నత చదువులకు ప్రోత్సహించారు. ఈయన ప్రోత్సాహంతో సుమారు 24 మంది విద్యార్థులు నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. మరో 30 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఇద్దరు విద్యార్థులు ఐఐటీలో ఎంటెక్ సీట్లు సాధించారు. సైన్సు ప్రదర్శనలో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో విజేతలుగా నిలిచారు. ఏటా సైన్సు దినోత్సవాన్ని తన సొంత ఖర్చులతో సుబ్బరాజు నిర్వహిస్తున్నారు. ఆయన విద్యార్థులు చెకుముకి సైన్సు క్విజ్ పోటీల్లో మూడు సార్లు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తున్నారు. దశాబ్ద కాలంగా ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. సైన్స్‌ఫేర్‌లో ఒకసారి జాతీయ స్థాయిలో, ఏడు సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించారు.

అలుపెరుగని సింగ్ మాస్టారు



నాడు-నేడు పాఠశాల ప్రహరీపై బొమ్మలు వేస్తున్న నాగేంద్రసింగ్



నా పాఠశాల, నా విద్యార్థులు, నా పాఠ్యాంశాల బోధన, నా తరగతి అనే అంశాలతో నిరంతరం గడిపేస్తూ విశ్రాంతి ఎరుగని ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు ఆర్.నాగేంద్రసింగ్. శ్రీరామ్‌నగర్ ప్రత్యేక పాఠశాలలో పనిచేస్తున్న ఆయన 1998లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. బాహ్య అంశాలను చొప్పించి పాఠాలు బోధించడం, బొమ్మలు వేసి వినూత్నంగా బోధించడం ఆయన శైలి. నాడు–నేడులో భాగంగా పాఠశాల ప్రహరీలపై ఆయన ఆకర్షణీయంగా బొమ్మలు వేసి ఔరా అనిపించారు. తన స్నేహితుడిని ప్రోత్సహించి విద్యార్థులకు యూనిఫాం కుట్టు పనికి అవసరమైన రూ.20 వేలు ఇచ్చేలా కృషి చేశారు. అలాగే క్రీడాకారులకు స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన 200కు పైగా టీ–20 క్రికెట్ పోటీలకు అంపైర్‌గా వ్యవహరించారు. ఆయన దివ్యాంగుడైనా ఏమాత్రం లెక్కచేయకుండా పలు రకాల శిక్షణలతో ఆకట్టుకుంటున్నారు.

రైతుల కళ్లలో వెలుగులు నింపాలి



జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో పార్టీ ఇన్‌చార్జి విజయరాజు, నాయకులు

జంగారెడ్డిగూడెం: రైతుల కళ్లల్లో కన్నీళ్లు తుడిచి, వెలుగులు నింపాలని వైఎస్సార్‌సీపీ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు డిమాండ్ చేశారు. ఈనెల 9న జంగారెడ్డిగూడెంలో ప్రదర్శన నిర్వహించి రైతు సమస్యలపై ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించే నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథరావుతో కలిసి ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ ఈనెల 9న రైతుల సమస్యలు పరిష్కరించి, యూరియా, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచి, గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ భారీ ప్రదర్శన నిర్వహించనున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మోసపూరిత వాగ్దానాలు చేసిందన్నారు. గతేడాది అన్నదాత సుఖీభవకు ఎగనామం పెట్టిందన్నారు. మెట్ట ప్రాంతంలో పొగాకు, మిచ్చి, కోకో, పామాయిల్ తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. ప్రస్తుతం యూరియా కొరతతో రైతులు అల్లాడుతున్నారని, గంటల తరబడి డీసీఎంఎస్‌ల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీఎం చంద్రబాబు ఈ విషయంలో సిగ్గుపడాలన్నారు. చంద్రబాబు దృష్టి అమరావతిపై ఉందని, రైతులపై లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కీసర సరితా రెడ్డి, పార్టీఉపాధ్యక్షుడు జగ్గవరపు జానకిరెడ్డి, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొద్దు వెంకటేశ్వరరావు, ప్రచార విభాగం అధ్యక్షుడు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు కర్పూరం గవరయ్య గుప్త, నాలుగు మండలాల అధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర, రమేష్‌రెడ్డి, ఎ.శాంతారావు, ఆర్.సత్యనారాయణ, రైతు విభాగం అధ్యక్షులు ఖాదర్‌బాబు రెడ్డి, చండీప్రియ, ముప్పిడి శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శులు గురుజాల పార్థసారథి, కుక్కల ధర్మరాజు, మల్నీడి బాబి, జెట్టి ఆదిత్య, బత్తిన చిన్న, చింతలపూడి జెడ్పీటీసీ ఎం.నీరజ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం

- 9న ర్యాలీ, వినతిపత్రం అందజేత
- పార్టీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: పంటలకు అదునులో వేయాల్సిన యూరియా సరఫరాలో విఫలమైన తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ ఈనెల 9న ఏలూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పిలుపునిచ్చారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. డీఎన్నార్ మాట్లాడుతూ పార్టీ ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం అక్కడక్కడా యూరియాను సరఫరా చేస్తోందన్నారు. పూర్తిస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించడానికి మంగళవారం ఉదయం 10 గంటలకు ఏలూరుకు అందరూ హాజరుకావాలన్నారు. ముందుగా వైఎస్ విగ్రహానికి నివాళి అర్పించి, శాంతియుత ర్యాలీతో ఆర్డీఓ కార్యాలయానికి చేరాలన్నారు. ఇప్పటివరకు కైకలూరు నియోజకవర్గంలో 6,600 పైబడి కార్యకర్తలు, నాయకుల వివిధ హోదాల్లో పదవులు పొందారన్నారు. వీరికి పార్టీ తరపున గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. ఒకేసారి అందరికీ సెల్‌ఫోన్లలో సందేశాలు అందించే ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో వివిధ విభాగాల పనితీరును బోర్డుపై డీఎన్నార్ వివరించారు.

కూటమి ప్రభుత్వానికి అరిష్టం

పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీరరాజు, ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు మాట్లాడుతూ రైతు కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి అరిష్టదాయకమన్నారు. 50 ఏళ్ల క్రితం యూరియా కొరత చూశామని, చంద్రబాబు పాలనలో మరోసారి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీలు రామిశెట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ మాట్లాడుతూ విజనరీ సీఎం అని చెప్పుకునే వారు యూరియా సమస్యను పరిష్కరించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి బీవీ రావు మాట్లాడుతూ కూటమి పేరు మార్చిన అన్నదాత సుఖీభవతో ఉపయోగం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి గాదిరాజు మణికంఠ వర్మ, రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీ గాలిబ్ బాబు, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు దుగ్గిరాల నాగు, ఎస్సీ విభాగ రాష్ట్ర నాయకుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని రమేష్, బోయిన రామరాజు, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు జయమంగళ కాసులు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, దున్నా బేబీ, చాన్‌భాషా, చినరాజు, ఈడే వెంకటేశ్వరరావు, మండ నవీన్, ఏసుబాబు, నరసయ్య, బొబ్బిలి రత్తయ్యనాయుడు, సమయం అంజి, రేగిశెట్టి రాము పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో కూటమి విఫలం

మాజీ ఎమ్మెల్యే బాలరాజు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా కూటమి ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెంలో పార్టీ సీనియర్ నేత ఆరేటి సత్యనారాయణ ఇంటి వద్ద గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూరియాను రైతులకు అందకుండా బ్లాక్‌లో విక్రయిస్తూ రైతులను కష్టాలు పాలు చేస్తున్నారన్నారు. పంటల బీమా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు అమరావతిలో కూర్చుని ఉచిత సలహాలు ఇస్తున్నారని విమర్శించారు. వరికి రైతులు యూరియా వేయొద్దని సలహా ఇవ్వడం శోచనీయమన్నారు. ఆయన తనయుడు లోకేష్ గల్లాపెట్టె సర్దుకుంటున్నారని, పవన్ కల్యాణ్ సినిమా షూటింగ్‌లో బిజీ అయిపోయారని మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో రైతును పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రైతుల దయనీయ స్థితి అర్థమవుతుందన్నారు. పొగాకు, మిర్చి, పామాయిల్ ఇలా ఏ పంట చూసినా గిట్టుబాటు ధర లేదన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేయడంతో పాటు విత్తు నుంచి పంటల విక్రయాల వరకూ అండగా నిలిచారన్నారు. కరోనా కష్టకాలంలోనూ అన్నివిధాలా అండగా నిలిచారన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయించి గిట్టుబాటు ధర కల్పించారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం యూరియా సరఫరా చేయకపోతే రైతులే ప్రభుత్వానికి ఉరి వేస్తారన్నారు. రైతు సమస్యలపై ఈనెల 9న జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ బాజీ, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తాళ్లూరి ప్రసాద్, జిల్లా విభజన విభాగం ఉపాధ్యక్షుడు బగ్గి దినేష్, సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, తెల్లం వెంకటలక్ష్మి, మాల్చి వెంకన్నబాబు, నాయకులు తెల్లం దేవరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణలో పొంతన లేని మాటలు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం భూ సేకరణలో జిల్లా అధికారులు చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ పరిస్థితికి పొంతనే లేదని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ భూ సేకరణలో అధికారులు చెప్పేది ఒకటి, అక్కడ జరిగేది మరొకటి అన్నారు. ఇప్పటికే భూసేకరణ చేశామని, మిగులు భూములు ఉన్నాయని ప్రకటించిన అధికారులు వాటి లెక్కలు, వివరాలు తెలియచేయలేదని, అప్పుడే ఆ భూసేకరణ సందర్భంగా దాదాపు రూ.500 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఇప్పుడు మరో 8 వేల ఎకరాల భూసేకరణ కోసం జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు.

కోకో రైతులు సంఘటితం కావాలి



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న రైతు నాయకులు

పెదవేగి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోకో రైతులు సంఘటితం కావాలని రైతు నాయకులు పిలుపునిచ్చారు. గురువారం విజయరాయిలోని సీతారామ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు. సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఏబీ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా రైతులను మోసగిస్తున్నాయని విమర్శించారు. అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో కోకో బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సరైన మార్కెటింగ్ విధానంలో కోకో గింజలను అమ్ముకో గలిగితే రైతులకు లాభాలు వస్తాయని సీపీసీఆర్ఐ కాసర గోడ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ పి.చౌడప్ప అన్నారు. నాబార్డ్ ఏజీఎం ఎం.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కోకో రైతుల ఎఫ్‌పీఓకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఉద్యాన శాఖ జేడీ మునిరెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఎస్.రామ్మోహన్, కొబ్బరి రైతుల ప్రాంతీయ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి, పెదవేగి ఆయిల్ పామ్ రైతుల సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకటరావు, సంఘ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, కోకో రైతుల సంఘం రాష్ట్ర నాయకులు గుదిబండి వీరారెడ్డి, కోనేరు సతీష్‌బాబు పాల్గొన్నారు.

రాయితీని తగ్గించుకునే ప్రయత్నం



కె.శ్రీనివాస్

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వం యూరియాపై సబ్సిడీ తగ్గించుకునేందుకు చేస్తున్న కుట్రలో భాగంగానే యూరియా దిగుమతి చేసుకోకుండా కొరత సృష్టిస్తోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ విమర్శించారు. ఏలూరులోని అన్నే భవనంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యూరియాపై సబ్సిడీని కుదించి వేసిందన్నారు. రాష్ట్రానికి సరిపడా యూరియా అందించని కేంద్రంపై ఒత్తిడి చేయకుండా సీఎం చంద్రబాబు ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం తగదన్నారు. యూరియా కోసం రైతులు సొసైటీలు, ఎరువుల షాపులు ముందు క్యూలు కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ఆధార్‌తో లింకు పెట్టి యూరియా ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. రైతులకు నానో యూరియా అంటగట్టడం తగదన్నారు. వర్షాల సీజన్‌లో ఎరువుల కొరత దారుణమన్నారు. అనంతపురం జిల్లాలో సోలార్ ఎనర్జీ కంపెనీలకు సేకరిస్తున్న భూములు పరిశీలనకు వెళ్లిన రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డికి గుంతకల్లు ఎమ్మెల్యే జి.జయరాం ఫోన్ చేసి దూషించడాన్ని ఖండిస్తున్నామన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పాము కాటుకు రైతు బలి



అశోక్ (ఫైల్)

ద్వారకాతిరుమల: మండలంలోని సూర్యచంద్రరావుపేటలో ఒక రైతు పాము కాటుకు గురై మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చవల అశోక్ (23) వ్యవసాయం చేస్తుంటాడు. రోజులానే బుధవారం సాయంత్రం పొలానికి వెళ్లిన అశోక్ గడ్డి కోస్తుండగా కాలుపై తాచుపాము కరిచింది. వెంటనే అక్కడున్న రైతులు తొలుత భీమడోలు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. అశోక్‌కి ఇంకా వివాహం కాలేదు. ఈ ఘటనపై మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

'విశ్వకర్మ' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏలూరు(మెట్రో) : ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద చేతివృత్తి శ్రామికులకు, హస్తకళ నిపుణులకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న ఎంఎంఎస్‌ఎంఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ కేఎస్ ప్రభాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ అభ్యర్థులు, చేతివృత్తులు చేసుకుంటున్నవారు పీఎం విశ్వకర్మ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కొరకు కామన్ సర్వీస్ సెంటర్స్ లేదా వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. ఇతర సమాచారం కొరకు జీఎం, జిల్లా పారిశ్రామిక కేంద్రం, ఏలూరు వారిని పనివేళలో సంప్రదించాలన్నారు.

7న మధ్యాహ్నం నుంచి మావుళ్లమ్మ దర్శనం నిలుపుదల

భీమవరం (ప్రకాశంచౌక్) : ఈ నెల 7వ తేదీ చంద్ర గ్రహణం కారణంగా పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో మధ్యాహ్నం 12.30 గంటలకు మహానివేదన అనంతరం అమ్మవారి దర్శనం నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 8వ తేదీ ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో సంప్రోక్షణ జరిపిన అనంతరం ఉదయం 8.30 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు అనుమతించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

గురువులపై కర్ర పెత్తనం

- రోజురోజుకీ పెరుగుతున్న నిఘా
- ఒక పక్క డైట్ లెక్చరర్లతో తనిఖీలు
- మరో వైపు మండల అకడమిక్ ఫోరంల ఏర్పాటు
- రోజువారీ హాజరుపైనా పర్యవేక్షణ
- ఉక్కిరిబిక్కిరవుతున్న ఉపాధ్యాయులు



బువ్వనపల్లి జెడ్పీస్కూల్లో ఉపాధ్యాయుల పనితీరును పరిశీలిస్తున్న డైట్ లెక్చరర్ లక్ష్మీనారాయణ (ఫైల్)



అర్ధవరం జెడ్పీస్కూల్లో మూల్యాంకన పుస్తకాలు తనిఖీ చేస్తున్న డీఈవో నారాయణ (ఫైల్)

నిడమర్రు: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ గురువులపై రోజు రోజుకూ నిఘా పెరుగుతూనే ఉంది. అందులో భాగంగా బడుల్లో నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమానికి పరిశీలకులు, సాక్షులు, నోడల్ పర్సన్స్‌ల పేరుతో ఇతర శాఖ అధికారులు, సిబ్బందితో ఉపాధ్యాయులపై పెత్తనం చేస్తున్నారంటూ వారు ఆరోపిస్తున్నారు. మరో పక్క రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకూ విద్యాశాఖ అధికారుల తనిఖీలు మామూలే. తాజాగా ఒక పక్క డైట్ కళాశాల అధ్యాపకులతో తనఖీలు చేస్తుండంగా మరో పక్క మండల అకడమిక్ ఫోరంలు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులపై పర్యవేక్షణ పెంచేలా విద్యాశాఖ సిద్ధమైంది. ఇప్పటికే మూల్యాంకన పుస్తకాలు దిద్దడం, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందించడం, మార్కులు ఆన్‌లైన్ చేయడం, టీచర్ డైరీ నింపడం వంటి కార్యక్రమాలతో వారం రోజులుగా ఉపాధ్యాయులకు బోధనకు దూరంగా ఉన్న సమయంలో ఉన్నత అధికారులతో తనిఖీలు చేయడంపై ఉపాధ్యాయ వర్గం మండిపడుతోంది.

నాలుగు మండలాలకు ఒక డైట్ లెక్చరర్

దూబచర్ల డైట్ కళాశాలల్లో ఉన్న 11 మంది అధ్యాపకులకు నాలుగు మండలాల చొప్పున ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరుపై నివేదికలు అందించేలా ఉన్నత అధికారులు వారిని నియమించారు. వీరంతా వారికి కేటాయించిన మండలాల్లో ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, భోజన పథకం వంటి అనేక అంశాలను పరిశీలించి జిల్లా అధికారులకు రోజువారీ నివేదిక అందించాల్సి ఉంది.

వీరు పరిశీలించే అంశాలు

విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు సమయం, సిలబస్, టెక్ట్స్ బుక్, వర్క్ బుక్స్, నోట్ బుక్స్ పరిశీలన. ప్రతి శనివారం నిర్వహించే నోబ్యాగ్ డే కృత్యాల పుస్తకాలు, అభ్యసనా ఫలితాలు అంచనా వేయడం, మూల్యాంకన పుస్తకాలు, టీచర్ డైరీలు, స్కూల్ నమోదుపై జరుగుతున్న కృషి, మధ్యాహ్న భోజన పథకం రికార్డులు, విద్యాప్రవేశ్ కార్యక్రమం నిర్వహణ వంటి అనేక అంశాలు పరిశీలిస్తారు. వీరందరూ అందించిన నివేదికలను సరి పోల్చుకుని ఆ పాఠశాల పనితీరుపై రాష్ట్రస్థాయిలో ఒక సమగ్ర నివేదిక అందించేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటారు.

మండల ఎకడమిక్ ఫోరంలు

ప్రతి మండలాల్లో ఇప్పటికే మండల అకడమిక్ ఫోరంలు ఏర్పాటు చేశారు. ఈ ఫోరంలో ఎంఈవో 1, 2లు, నాలుగు క్లస్టర్ చైర్మన్‌లు, హైస్కూల్ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ టీచర్లు ఏడుగురు, ప్రైమరీ ఎక్స్‌పర్ట్ టీచర్స్ 5గురుని నియమించారు. వీరంతా వారానికి రెండు సార్లు మండల ప్రాతిపదికగా పాఠశాలలు పరిశీలన చేయాల్సి ఉంది. ఈ ఫోరంలో ఎంఈవో1, ఎంఈవో2 రెండు వేర్వేరు బృందాలుగా ఆయా గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను ఏకకాలంలో విజిట్ చేస్తారు. అలాగే విజిట్ జరుగుతున్న రోజు సంబంధిత స్కూళ్లలో ఏ టీచర్‌కు సెలవు మంజూరు చేయరు. అందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటారు.

పంట నష్టంతో కౌలు రైతు ఆత్మహత్య

ఏలూరు టౌన్ / చింతలపూడి : పంట నష్టంతో కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చింతలపూడి మండలం నరసింగపురం గ్రామానికి చెందిన మాదాసు సూరిబాబు (45) స్థానికంగా రెండు ఎకరాల సొంత పొలం ఉండగా మరో 5 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాను వేసిన మొక్కజొన్న పంట మొత్తం నీటిపాలైంది. దీంతో వ్యవసాయానికి చేసిన అప్పులు ఏ విధంగా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై బుధవారం ఇంటివద్దే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం చింతలపూడి ఏరియా హాస్పిటల్‌కు, అక్కడి నుంచి గురువారం మధ్యాహ్నం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తూ ఉండగా కౌలురైతు మృతిచెందాడు. మృతుడు సూరిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై కె సతీష్ కుమార్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

చాట్రాయి, ఏలూరు టౌన్: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాట్రాయి మండలంలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన మానికల సత్యం(62) మద్యానికి బానిసై ఆర్థికంగా చితికిపోవడంతో మనస్తాపం చెంది మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు చింతలపూడి తరలించారు. అక్కడ నుంచి అంబులెన్స్ ద్వారా ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యం పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

గంజాయి కేసులో ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్సై రాంబాబు

ఏలూరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్ చేయగా, ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఎస్సై పీ రాంబాబుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈనెల 3వ తేదీన ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో గ్రాండ్ కృష్ణ ఫంక్షన్ హాల్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బందితో దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో నిందితులు ఏలూరుకు చెందిన విష్ణుశెట్టి సత్యరూప్‌కుమార్ అలియాస్ సతీష్, కొమ్మిన మణికంఠ అలియాస్ సర్దార్‌పాండా, తమ్మిశెట్టి రామ్‌చరణ్, అల్లంపల్లి రాజేష్ తోపాటు మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారివద్ద నుంచి సుమారు మూడున్నర కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులపై ఏలూరు మండలంలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే వివిధ కేసులు నమోదయ్యాయని చెప్పారు.

వదలని వరద గోదావరి

- జలదిగ్బంధంలో 25 గ్రామాలు
- నేటికీ బయట పడని రహదారులు
- పడవ ప్రయాణమే ఆ గ్రామాలకు దిక్కు



నీటమునిగి ఉన్న పాతనార్లవరం రహదారి

వేలేరుపాడు: ఒక వైపు గ్రామాలను చుట్టుముట్టిన గోదావరి వరద.. మరో వైపు అడపా దడపా జోరున కురుస్తున్న వాన.. ముంపు మండలాల వాసులను మూడు నెలలుగా కలవరపెడుతున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి వరద నీటి మట్టం తగ్గుతూ.. పెరుగుతూ దోబూచులాడుతోంది. ఎగువన ఉన్న తుపాకులగూడెం సమ్మక్క, సారక్క పూర్తిగా గేట్లు ఎత్తివేశారు. దీంతో 8 లక్షల క్యూసెక్కుల నీరు కిందకు వదిలారు. దీనికి తోడు తాలిపేరు వరద తోడవ్వడంతో బుధవారం 43 అడుగులకు నీటి మట్టం పెరగడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. గురువారం రాత్రి 8.30కు గోదావరి నీటి మట్టం 42.60 అడుగులకు చేరడంతో ఉపసంహరించారు. వరద వల్ల జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 18 రోజులుగా వేలేరుపాడు మండలంలో 25 గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో మేళ్ళవాగు, ఎద్దెలవాగు, టేకూరు, తదితర వాగుల వంతెనలు ముంపులోనే ఉన్నాయి. దిగువనున్న కొయిదా, కాచారం, పేరంటపల్లి, టేకుపల్లి, తాళ్ళగొంది, పూసుగొంది, టేకూరు, కట్కూరు, సిద్దారం, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు, చిగురుమామిడి, బోళ్ళపల్లి, పాతనార్లవరం, తూర్పుమెట్ట, కొత్తూరు, తదితర గ్రామాలతోపాటు మరో ఎనిమిది గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము, వెళ్లే రహదారి నేటికీ మోకాల్లోతు నీరు పారుతోంది. దీంతో ఆయా గ్రామ ప్రజలు మోకాల్లోతు నీటిలో ప్రయాణిస్తున్నారు. రుద్రమకోట వెళ్లే రహదారులు ఇంకా నీటిలోనే మునిగి ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు లచ్చిగూడెం గ్రామం గుండా రాకపోకలు సాగిస్తున్నారు.



టేకూరు వాగు వద్ద పడవ దాటుతున్న ప్రజలు



పడవపై పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

పడవ ప్రయాణమే దిక్కు

దిగువ ప్రాంతంలో ఉన్న 18 గిరిజన గ్రామాలకు గత మూడు నెలలుగా పడవ ప్రయాణమే దిక్కయింది. ఎద్దెలవాగు, టేకూరు, వాగుల వంతెనలు నీట మునగడంతో పడవల పైనే ప్రయాణం సాగిస్తున్నారు. ఏ అవసరమున్నా మండల కేంద్రమైన వేలేరుపాడుకు రావాలంటే పడవ దాటి రావాల్సిందే. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు కూడా పడవల పైనే పాఠశాలలకు వస్తున్నారు. గురువారం టేకూరు వాగు వద్ద స్థానిక పోలీసులు పడవ దాటించి పాఠశాలలకు పంపుతున్నారు. ఎస్పీ కె ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో లైఫ్ జాకెట్‌లతో బోట్‌లపై ప్రయాణిస్తున్నారు.

పాతనార్లవరం గ్రామాన్ని పట్టించుకోని అధికారులు

జలదిగ్బంధనంలో ఉన్న పాతనార్లవరం గ్రామాన్ని అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. ఇక్కడ 50 కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి వెళ్లే రహదారి నీటమునిగి జలదిగ్బంధనంలో ఉన్నప్పటికీ ఆ గ్రామానికి కనీసం పడవ కూడా ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఇసుక లారీల స్వాధీనం



అల్లిపల్లి సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

చింతలపూడి: ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా గోదావరి ఇసుకను హైదరాబాద్ తరలిస్తున్న లారీలను చింతలపూడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చింతలపూడి మండలం ఏపీ, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల గుండా ఇసుకను తెలంగాణలో అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమార్కులు అక్రమంగా ఆర్జిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున పోలవరం, కొవ్వూరు ఇసుక రీచ్‌ల నుంచి తరలిస్తున్న 16 ఇసుక లారీలను స్థానికుల సమాచారం మేరకు అల్లిపల్లి సమీపంలో చింతలపూడి సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న లారీలను రెవెన్యూ అధికారులకు హ్యాండోవర్ చేశారు. కాగా ఇసుక లారీలు పట్టుబడిన వెంటనే అప్రమత్తమైన అక్రమార్కులు వాటిని విడిపించుకునేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అయితే పోలీసులు ఎలాంటి వత్తిళ్ళకు తలొగ్గకుండా కేసులు నమోదు చేశారు. నిత్యం వందలాది లారీల్లో ఇసుక ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రం తరలి పోతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏపీ, తెలంగాణ సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మద్యం మత్తులో హత్యాయత్నం





తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్, నాగమణి

తణుకు అర్బన్: మద్యం మత్తులో ఉన్న యువకుడు కత్తితో భార్యభర్తలపై దాడికి పాల్పడిన ఘటన తణుకులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు కొమ్మాయిచెర్వుగట్టు ప్రాంతంలో వినాయచవితి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఊరేగింపులో జరిగిన వాగ్వాదంలో చుక్కా సంజయ్ అనే యువకుడు స్థానికంగా నివసిస్తున్న కొలుసు శంకర్, నాగమణి దంపతులపై కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. గత పదేళ్లుగా తణుకులో కొబ్బరికాయల వ్యాపారం చేసుకుంటున్న శంకర్‌కు, సంజయ్ పాత గొడవలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పూటుగా మద్యం సేవించి ఉన్న సంజయ్ బాధితుడి ఇంట్లోకి చొరబడి కత్తితో దాడిచేసినట్లుగా తెలుస్తోంది. తీవ్రంగా గాయపడ్డ భార్యాభర్తలిద్దరినీ స్థానికులు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా వైద్యసేవలందిస్తున్నారు. దాడికి పాల్పడిన యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. పట్టణ ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోపణలు అవాస్తవం

నూజివీడు: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశారంటూ నూజివీడుకు చెందిన అరిగెల అమృతవల్లి చేసిన ఆరోపణలు అవాస్తవమని కే సంధ్య, ఆమె సోదరుడు కే శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మా తల్లి ఇంట్లో గతంలో కొన్ని నెలలు అమృతవల్లి పనిమనిషిగా పనిచేసిందని, ఆ సమయంలో తన ఆర్థిక ఇబ్బందులు చెప్పి విదేశాల్లో ఏమైనా అవకాశాలుంటే తనకు సాయం చేయాలని కోరిందన్నారు. దీంతో తమ స్నేహితుడు డాక్టర్ సమీర్ ఖతార్‌లో ఉంటే ఆయన ద్వారా సాయం చేయడమే కాకుండా శ్రీకాంత్ సైతం కొంత డబ్బును ఆమెకు చేబదులుగా ఇచ్చాడన్నారు. దీంతో ఖతార్ వెళ్లిన ఆమె రెండు నెలల పాటు అక్కడ పనిచేసి జీతం కూడా తీసుకుందన్నారు. అయితే వీసా మార్పిడి, వర్క్ పర్మిట్ వంటి అవసరమైన వాటిని అమృతవల్లి చేసుకోలేక తిరిగి ఇక్కడకు రావాల్సి వచ్చిందన్నారు. తిరుగు ప్రయాణం టిక్కెట్ కూడా సమీర్ కొని పంపించాడని, కానీ అమృతవల్లి మాత్రం నష్టపోయినట్లు నటిస్తూ, తప్పుడు ఆరోపణలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు దండుకోవడానికి చూస్తోందన్నారు. ఆమె ఆరోపణలకు మా కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

సందిగ్ధంలో వీసీ పీఠం

- వ్యాజ్యపరమైన అంశంతో ముడి
- 11న స్పష్టత వచ్చే అవకాశం



ఉద్యాన వర్సిటీ ముఖద్వారం

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఉద్యోగ కాల పొడిగింపు, లేదంటే కొత్త వారి నియామకం వ్యవహారం సందిగ్ధతకు ఇంకా తెరపడలేదు. వ్యవహారం వ్యాజ్యపరమైన వివాదంతో ముడిపడి ఉండటంతో ఇంకా కామాలతో వ్యవహారం సాగుతోంది. ప్రస్తుత వీసీ ఉద్యోగ కాలం ఆగస్టు 31తో ముగిసింది. యూజీసీ నిబంధనల ప్రకారం జీఓ నంబరు 39ను అనుసరించి తనకు 65 ఏళ్ల వయస్సు వచ్చే వరకు వీసీ పదవిలో కొనసాగించాలని వీసీ గోపాల్ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు గత నెలలో ఈ నిబంధన వ్యవసాయశాఖ పరిధిలో ఉద్యోగులుగా ఉన్న వారికి వర్తించదని, దీనిపై మరోసారి అఫిడవిట్ సెప్టెంబరు 29న దాఖలు చేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వీసీ కొనసాగింపు, లేదా ఇన్‌చార్జిని నియమించడం వంటి ప్రక్రియను పూర్తి చేయలేదు. ఈలోగా అఫిడవిట్ దాఖలుకు ముందు న్యాయస్థానంలో జరిగిన వాదనల నేపథ్యంలో మరోమారు ఈ నెల 11న ఉద్యాన వర్సిటీ వీసీ వ్యవహారంపై వాదనలు జరుగనున్నాయని తెలిసింది. దీంతో వీసీ కొనసాగింపు, లేదంటే కొత్త వారిని నియమించడం అనేది 11న తేలవచ్చని తెలుస్తోంది.

తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు..

ఉద్యోగ నియామక పత్రాలను ఉద్యోగులకు ప్రభుత్వాలు ఇచ్చే సమయంలో అంటిల్ ఫర్‌దర్ ఆర్డర్ అనే పదాన్ని నియామకపు లేఖలో ఉటంకిస్తాయి. అంటే తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఇచ్చిన ఉద్యోగంలో కొనసాగవచ్చు అని అర్థం. అంటే ఉద్యోగకాలం ఉన్న వారికి మాత్రమే అంటిల్ ఫర్‌దర్ ఆర్డర్ అనే నిబంధన వర్తిస్తుంది. అంతే కాని ఉద్యోగ విరమణ చేసిన వారి విషయంలో వర్తించదు. ఉద్యానవర్సిటీ వీసీగా ఉన్న కె.గోపాల్ ఉద్యోగకాలం ఆగస్టు 31తో ముగిసింది. అంటిల్ ఫర్‌దర్ ఆర్డర్ మార్గదర్శకాలు ఆయనకు వర్తించదని అధికార వర్గాల సమాచారం. అయితే వీసీ తర్వాత పర్యవేక్షక బాధ్యతలు వహించాల్సిన వ్యక్తులు కూడా అంటిల్ ఫర్‌దర్ ఆర్డర్‌ను అడ్డు పెట్టుకొని తన పైఅధికారి విషయంలో మౌనంగా ఉన్నారని తెలుస్తోంది. గురువారం జరుగనున్న రాష్ట్ర క్యాబినెట్‌లో టేబుల్ అజెండాగా పెట్టే విషయంలో ఉద్యానవర్సిటీ వీసీ అంశంగా ఉండవచ్చనే ఊహాగానాలు ఉన్నాయి.

మద్యం అనుకుని పురుగు మందు తాగి..

కలిదిండి(కైకలూరు): పురుగుమందును మద్యంగా భావించి తాగిన వ్యక్తి మృతి చెందిన ఘటన కలిదిండి మండలం ఆవకూరులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆవకూరుకు చెందిన కాట్రగడ్డ నరసింహస్వామి(39)తో కూచిపూడికి చెందిన జ్యోత్స్నతో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు (10), కుమార్తె (6) సంతానం. నరసింహస్వామి ఐదేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవలు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో భార్య పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. అతను గురువారం తెల్లవారుజామున మద్యం మత్తులో ఆవకూరు ఇంటి వద్ద మద్యం అనుకుని పురుగుమందు తాగాడు. కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేసి, అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరసింహస్వామి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదుపై ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్షులు వేటాడుతున్న ఏడుగురి అరెస్ట్



నాటు తుపాకులు స్వాధీనం చేసుకుంటున్న ఫారెస్ట్ అధికారులు

నరసాపురం: లక్ష్మణేశ్వరం చేపల మార్కెట్ వద్ద పక్షులను వేటాడి విక్రయిస్తున్న ఓ బృందంపై గురువారం భీమవరం ఫారెస్ట్ రేంజ్ అధికారులు దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మూడు నాటు తుపాకులు, కొంత గన్ పౌడర్, 13 మృత పక్షులను స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణులను వేటాడటం, అక్రమ ఆయుధాలు కలిగి ఉన్న నేరంపై కేసు నమోదు చేసినట్టు భీమవరం ఫారెస్ట్ రేంజ్ మురాల కరుణాకర్ అధికారి చెప్పారు. వన్యప్రాణులను వేటాడటం, విక్రయించడం చట్టప్రకారం నేరమని హెచ్చరించారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



ఘటనా స్థలంలో లారీ కింద వృద్ధుడి మృతదేహం

జంగారెడ్డిగూడెం: లారీ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్టేషన్ రైటర్ పి.బాబూరావు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలాపురం గ్రామానికి చెందిన మనెల్లి చిన రామయ్య (79) గ్రామం నుంచి జంగారెడ్డిగూడెం వచ్చి నాగులగూడెం వెళ్లేందుకు ఆటో కోసం పంగిడిగూడెం రోడ్డులోని మీ సేవా కేంద్రం సమీపంలో ఎదురుచూస్తున్నాడు. ఆ సమయంలో అటుగా వస్తున్న లారీ చిన్న రామయ్యను ఢీకొట్టగా అతను అక్కడికక్కడే మృతిచెందాడు. వృద్ధుడి కుమారుడు మనెల్లి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాబూరావు తెలిపారు.